నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

మేడ్చల్‌: ఫీడర్‌ మరమ్మతుల కారణంగా నేడు మేడ్చల్‌, మేడ్చల్‌రూరల్‌ పరిధిలో పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని ఏఈలు మౌలాలి, రాంబాబు తెలిపారు. అత్వెల్లి పరిధిలోని కోర్టు రోడ్డు, జయదర్శిణి, బ్రాడ్‌వే, లోటస్‌, అత్వెల్లి ముస్లింబస్తీ, కిష్టాపూర్‌లోని పరిశ్రమలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కరెంట్‌ సరఫరా ఉండదని ఏఈలు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న యాదగిరియాదవ్‌

ఘట్‌కేసర్‌: పట్టణంలోని బస్సు ప్రయాణ ప్రాంగణంలో జన చైతన్య సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సర్పంచ్‌ యాదగిరియాదవ్‌ హాజరై చలివేంద్రం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులు, విద్యార్థులకు 14 ఏళ్లుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. తారాబాయ్‌, ప్రేమలత, రాణి, బాలమణి, రవీందర్‌, వెంకటేష్‌, ఆంజనేయులు, శశిధరన్‌, ప్రేమ్‌కుమార్‌, వీరేందర్‌, ప్రసన్న, శ్రీనివాస్‌గౌడ్‌, రాజు, సురేష్‌, ప్రవీణ్‌, సాయిరాం, నర్సింగ్‌రావు, జగదీస్‌, మధు, రాందాస్‌, గోపాల్‌గౌడ్‌, గణేష్‌ పాల్గొన్నారు.

లోక్‌ అదాలత్‌తో సత్వర న్యాయం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్‌

కుషాయిగూడ: లోక్‌ అదాలత్‌లతో సత్వర న్యాయం జరుగుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్‌, మల్కాజిగిరి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్‌ అన్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కుషాయిగూడ మల్కాజిగిరిజిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ లోక్‌అదాలత్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కక్షిదారుల సౌలభ్యం కోసం ఏర్పాటుచేసే లోక్‌ అదాలత్‌లను సద్వినియోగం చేసుకుని సత్వర న్యాయం పొందాలన్నారు. లోక్‌అదాలత్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా 21 బెంచీల్లో 316 సివిల్‌ కేసులు, 1,87,812 క్రిమినల్‌ కేసులకు పరిష్కారం చూపగా.. 19,996 ప్రీ లిటిగేషన్‌ కేసులు పరిష్కరించి రూ.61,31,654 పరిహారం కింద చెల్లించినట్లు తెలిపారు. జిల్లా న్యాయమూర్తి ఆర్‌. రఘునాథ్‌రెడ్డి, అదనపు జిల్లా న్యాయమూర్తి విక్రమ్‌కుమార్‌, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కిరణ్‌కుమార్‌, కీసర రెవెన్యూ డివిజనల్‌ అధికారి వెంకట ఉపేందర్‌రెడ్డి, డీసీపీ వెంకటరమణ, ఏసీపీ మహేష్‌కుమార్‌గౌడ్‌, బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



రామంతాపూర్‌ : నెహ్రూనగర్‌లోని సెయింట్‌ పాల్స్‌ హైస్కూల్‌లో విద్యార్థులు రూపొందించిన పలు నమూనాలతో ఏర్పాటుచేసిన వైజ్ఞానిక ప్రదర్శన రెండోరోజు శనివారం స్థానికంగా ఉన్న పలు పాఠశాలల విద్యార్థులు సందర్శించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉప్పల్‌ మండల విద్యాధికారి రామారావు మాట్లాడుతూ.. ప్రతిభ అనేది ఏ ఒక్కరి సొత్తు కాదని, అది ప్రతి విద్యార్థిలో దాగి ఉంటుందన్నారు. దీనికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధీటిమల్లయ్య స్కూల్‌ కరస్పాండెంట్‌ జీఎస్‌శర్మ, ప్రిన్సిపాల్‌ భాగ్యలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్‌ ఫెయిర్‌

అల్వాల్‌: అల్వాల్‌లోని త్రివేణి కిడ్స్‌ స్కూల్‌లో 'ఆస్క్‌ మీ మై ప్రాజెక్ట్‌' పేరిట సైన్స్‌ ఫెయిర్‌ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సరీ నుంచి ఐదోతరగతి వరకు విద్యార్థులు 300కు పైగా ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లా సైన్స్‌ అధికారి శ్రీనివాస్‌రెడ్డి హాజరై నమూనాలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైన్స్‌ఫెయిర్‌లతో విద్యార్థుల సృజనాత్మకత పెంపొందుతుందన్నారు. భవిష్యత్తులో ఈ బాలశాస్త్రవేత్తలంతా భారతదేశ కీర్తిని పెంపొందించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్‌ శ్రీసుధ, త్రివేణి సంస్థల సైన్స్‌ అధికారి సుబ్బారావు, అల్వాల్‌ జోన్‌ జోనల్‌ ఇన్‌చార్జి వెంకటరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వసూళ్లకు వేళాయే !

పురపాలికలు, జీపీల్లో పన్నుల టార్గెట్‌ రూ.209.40కోట్లు

- వసూలైన పన్ను రూ.169.66 కోట్లు
- నెలాఖరుకల్లా మిగిలిన పన్ను వసూళ్లపై కసరత్తు
- రోజువారీ మానిటరింగ్‌పై ప్రత్యేక చర్యలు



సాక్షి,సిటీబ్యూరో: నగర శివారు 13 పురపాలక సంఘాలు, 34 గ్రామ పంచాయతీల్లో 2024–25 ఆర్థిక సంవత్సరంలో వివిధ పన్నుల ద్వారా రూ.209.40 కోట్లు లక్ష్యంగా అధికార యంత్రాంగం నిర్ణయించింది. కానీ రూ.169.66 కోట్లు మాత్రమే వసూలైంది. మిగతా పన్నులు రూ.39.74 కోట్లు ఈ నెలాఖరుకల్లా వసూలు చేసేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికతో సంబంధిత పురపాలక సంఘాలు, జీపీలు ముందుకు సాగుతున్నాయి. మార్చి నెలాఖరు కల్లా 100 శాతం పన్నులు వసూలు చేయాలన్న లక్ష్యాన్ని పూర్తి చేసేలా రోజువారీ మానిటరింగ్‌పై కసరత్తు చేస్తున్నాయి.

పన్నులు ఇలా..

నగర శివారు మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాలో 4 మున్సిపల్‌ కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీలు ఉండగా.. ఈ పట్టణాల్లో ఇంటిపన్నుతో సహా వివిధ పన్నుల రూపేణా వసూలయ్యే నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టేలా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

- బోడుప్పల్‌, పీర్జాదిగూడ, జవహర్‌నగర్‌, నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్లతో పాటు పోచారం, తూముకుంట, నాగారం, మేడ్చల్‌, కొంపెల్లి, ఘట్కేసర్‌, గుండ్లపోచంపల్లి, దమ్మాయిగూడ, దుండిగల్‌ మున్సిపాలిటీలో వివిధ పన్నుల ద్వారా రూ. 198.45 కోట్లు వసూలు చేయాలని మున్సిపల్‌ యంత్రాంగం నిర్ణయించినప్పటికీ, రూ.162.09 కోట్లు మాత్రమే వసూలైంది.
- 34 గ్రామ పంచాయతీల్లో 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.10.95 కోట్లు లక్ష్యంగా నిర్దేశించినప్పటికీ, ఇప్పటి వరకు రూ.7.57 కోట్లు వసూలు చేశారు. పట్టణాలు, గ్రామ పంచాయతీల్లో లక్ష్యానికి అనుగుణంగా మిగతా పన్నులను ఈ నెలాఖరు వరకు వసూలు చేయాలని నిర్ణయించారు.

అభివృద్ధి కార్యక్రమాలు.. ఇతర ఖర్చులు

నగర శివారులోని 13 పురపాలక సంఘాలు, 34 గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు నిర్వహణ ఖర్చులు, సిబ్బంది జీత భత్యాలు, కరెంట్‌ బిల్లులతో సహా ఇతరత్రా ఖర్చులు, బిల్లుల చెల్లింపులకు ప్రధాన ఆదాయ వనరు పన్నులు కావడంతో వాటి వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్‌ చేపట్టేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే జిల్లాలోని పలు గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలల నుంచి 5 నెలల జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. – పంచాయతీల్లోనే కాకుండా పలు పురపాలక సంఘాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి నిర్వహణ, వీధిలైట్లు, రోడ్ల మరమ్మతులు తదితర కార్యక్రమాల నిర్వహణపనులు కూడా సంబంధిత జీపీలు ,పురపాలక సంఘాలు చూసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం పాలకవర్గాలు లేకపోవటంతో ఆ భారం సంబంధిత ఉద్యోగులపై పడుతోంది. ఈ నేపథ్యంలోనే పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.



మేడ్చల్‌ బస్టాండ్‌ ఆవరణలో చెత్త,చెదారం

కలెక్షన్‌లపై ఉన్న శ్రద్ధ..

సౌకర్యాలపై లేకపాయె !

- వ్యర్థాలమయంగా మేడ్చల్‌ బస్టాండ్‌
- పట్టించుకోని సంబంధిత అధికారులు



బస్సుల కోసం వేచిచూస్తున్న విద్యార్థులు, ప్రయాణికులు

మేడ్చల్‌ : ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చి కలెక్షన్లు సాధించడంలో మేడ్చల్‌ ఆర్టీసీ డిపో అగ్రస్థానంలో ఉన్నా సౌకర్యాల కల్పనలో మాత్రం జీరోగా ఉంది. అధికారుల నిర్వహణ లోపంతో మేడ్చల్‌ బస్టాండ్‌ వ్యర్థాలకు నిలయంగా మారింది. ఐదెకరాల విస్తీర్ణంలో ఉన్న మేడ్చల్‌ ప్రయాణ ప్రాంగణం వ్యర్థాలతో నిండిపోయింది. ముందు భాగం మినహా మిగతా ప్రాంతమంతా చెత్త, చెదారం ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది.

కనీస సౌకర్యాలు కరువు..

మేడ్చల్‌ బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. తాగునీటి కోసం ఎలాంటి వసతులు లేవు. ప్రయాణికులకు దాహమైతే నీళ్ల కొనుక్కోవాల్సిందే. వేలాది మంది వెళ్లే బస్టాండ్‌లో ప్రయాణికులు కూర్చోడానికి సరిపడా బల్లలు కూడా ఏర్పాటు చేయలేదు.

రద్దీ సమయాల్లో ఇబ్బంది..

ప్రయాణికులు బస్టాండ్‌లో కూర్చోవడానికి ఏర్పాట్లు లేకపోవడంతో ప్రధానంగా అమ్మాయిలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల సంఖ్యతో పాటు ప్రయాణికుల సంఖ్య పెరగడంతో 1974లో నిర్మించిన బస్టాండ్‌ సరిపోకపోవడంతో రద్దీ సమయాల్లో ప్రయాణికులు ఎండ, వానలోనే బస్సుల కోసం వేచిచూడాల్సి వస్తుంది.

ప్రైవేటు వాహనాలకు అడ్డాగా..

ఆర్టీసీ బస్టాండ్‌లకు 200 మీటర్ల దూరంలో ప్రైవేటు వాహనాల నిలపకూడదని నిబంధన ఉన్నా.. ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలకు మేడ్చల్‌ బస్టాండ్‌ అడ్డాగా మారింది. పోకిరీలు బస్టాండ్‌ ఆవరణలో అడ్డా ఏర్పాటు చేసుకుంటున్నారనే పలువురు ఆరోపిస్తున్నారు.

కనబడని శ్రద్ధ..

గతంలో సిబ్బంది శ్రమదానం చేసి హరితహారంలో మొక్కలు నాటి ఆవరణను అందంగా ఉంచేవారు. ప్రస్తుతం పట్టించుకోకపోవడంతో ఎక్కడా శ్రద్ధ కనిపించడం లేదు.

తనఖా పెట్టిన తీరని కష్టాలు..

గత ప్రభుత్వ హయాంలో మేడ్చల్‌ బస్టాండ్‌ స్థలాన్ని తనఖా పెట్టి ఇతర అవసరాల కోసం రుణాలు తీసుకుని ఇతర పనులు చేశారే గాని, మేడ్చల్‌ బస్టాండ్‌ను పట్టించుకోలేదు. మేడ్చల్‌ బస్టాండ్‌కు ప్రత్యేక నిధులు కేటాయించి బస్టాండ్‌ను ఆధునీకరించాలని ప్రజలు కోరుతున్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



డాక్టర్‌ రోహిణికి అవార్డు అందజేస్తున్న కళాశాల చైర్మన్‌ బాలారెడ్డి

మేడ్చల్‌రూరల్‌: ప్రస్తుతం సమాజంలో విద్యార్థులకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని, సాంకేతికతను అందిపుచ్చుకుని ముందుకుసాగాలని మైక్రోసాఫ్ట్‌ ప్రొడక్ట్‌ మేనేజ్‌మెంట్‌ సీనియర్‌ డైరెక్టర్‌ భరత్‌కుమార్‌ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్‌ పీటర్స్‌ ఇంజినీరింగ్‌ కళాశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆక్విలా– 2025 పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులు ఉద్యోగాల కోసం కాకుండా ఉద్యోగాలు సృష్టించే వారిగా ఎదగాలన్నారు. టెక్నాలజీని సద్వినియోగం చేసుకుని మేధస్సుకు పదును పెట్టొచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిత్య విద్యార్థిగా ఉండాలని, నిత్యం కొత్త విషయాలను నేర్చుకోవాలని సూచించారు. అంతకుముందు కళాశాల ప్రిన్సిపాల్‌ శ్రీలత కళాశాల వార్షిక నివేదికలను వివరించారు. రోజమ్మ జీవిత సాఫల్య పురస్కారానికి ఎంపికైన మెడికల్‌ అంకాలజిస్ట్‌ డాక్టర్‌ రోహిణికి కళాశాల చైర్మన్‌ బాలారెడ్డి, సెక్రటరీ టీవీరెడ్డి అవార్డు ప్రదానం చేసి సత్కరించారు. ఉత్తమ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల డైరెక్టర్లు సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, పీఆర్వో రవిసుధాకర్‌, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అట్టహాసంగా స్పోర్ట్స్‌ డే



మేడ్చల్‌: విద్యతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని అర్జున అవార్డు గ్రహీత, ఒలంపియన్‌క్రీడాకారిని జేజే.శోభ అన్నారు. మేడ్చల్‌ పట్టణంలోని న్యూ లిటిల్‌ లిల్లీ హైస్కూల్‌లో శనివారం క్రీడాదినోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. క్రీడాకారులుగా ఎదగాలంటే కృషి, పట్టుదల అవసరమని, విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. మహిళలు ప్రస్తుతం అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, సాధించాలనే పట్టుదల ఉంటే పురుషులకు ధీటుగా విజయాలు సాధించొచ్చని సూచించారు. క్రీడల్లో సైతం తగిన ప్రోత్సాహం లభించడంతో మహిళలు ఆకాశమే హద్దుగా ముందుకు సాగుతున్నారన్నారు. ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగి తమ లక్ష్యాలను సాధించుకోవాలని హితవు పలికారు. అనంతరం క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. స్కూల్‌ చైర్‌పర్సన్‌ మంజులప్రకాష్‌, జాతీయ ఖోఖో క్రీడాకారుడు వినోద్‌, డైరెక్టర్లు సాయిదీప్‌, మౌనిక, ప్రిన్సిపాల్‌ శాంతి, పీఈటీలు దుర్గాప్రసాద్‌, లావణ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులకు వ్యతిరేకంగా పోరాడాలి



జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ పరిధిలోని ప్రగతినగర్‌లో ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) గ్రేటర్‌ హైదరాబాద్‌ కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన కార్యక్రమంలో టీయూసీఐ తెలంగాణ రాష్ట్ర కార్మికసంఘం ఉపాధ్యక్షురాలు ఎస్‌ఎల్‌.పద్మ, నగర ప్రధాన కార్యదర్శి వరలక్ష్మి, సీపీఐ (ఎంఎల్‌)మాస్‌లైన్‌ గ్రేటర్‌ హైదరాబాద్‌ కార్యదర్శి హన్మేష్‌, మేడ్చల్‌ డివిజన్‌ కార్యదర్శి ప్రవీణ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఎల్‌.పద్మ మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, కుల దురహంకారాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. వీటిని అరికట్టాల్సిన ప్రభుత్వాలే హింసను ప్రేరేపించే విధంగా అశ్లీల చిత్రాలు, మద్యం, గంజాయి, డ్రగ్స్‌ తదితర వ్యాపారాలను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి మహిళలకు స్వేచ్ఛ, స్వతంత్రాలు కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం దక్కాలని, అన్ని రంగాల్లో మహిళలు రాణించాలని ఆకాంక్షించారు. అధ్యక్షురాలు లక్ష్మీబాయి, మహిళ సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు జయమ్మ, ఉమా, కనకమ్మ, ఆండాలు, రాజేశ్వరి, గంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వికసిత్‌ భారత్‌ యూత్‌ పార్లమెంట్‌ – 2025 పోస్టర్‌ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లిటిల్‌ ఫ్లవర్‌ డిగ్రీ కళాశాల

ఉప్పల్‌: ఉప్పల్‌ లిటిల్‌ ఫ్లవర్‌ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు విద్యార్థులతో కలిసి వికసిత్‌ భారత్‌ యూత్‌ పార్లమెంట్‌ – 2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ.. 18 నుంచి 25 ఏళ్ల యువతను పరిపాలన, నాయకత్వంలో నిమగ్నం చేయడమే లక్ష్యమన్నారు. మై భారత్‌ పోర్టల్‌ ద్వారా దేశ నిర్మాణంపై ఒక నిముషం నిడివి గల వీడియోను సమర్పించమని విద్యార్థులను ప్రోత్సహించమన్నారు. వీడియో సమర్పణ మార్చి16 లోగా పంపాలని కోరారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రోగ్రామ్‌ కో– ఆర్డినేటర్‌ విద్యాసాగర్‌, ఎన్‌వైకేఎస్‌ జిల్లా యువజన అధికారి ఇసయ్య, కళాశాల ప్రిన్సిపాల్‌ జయంతి రెడ్డి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ

ఉప్పల్‌: ఉప్పల్‌ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చారుకేశి ఫైన్‌ఆర్ట్స్‌ గురువులు, వారి శిష్య బృందంచే నిర్వహించిన భరతనాట్యం, కోలాటం, కర్ణాటక గాత్రకచేరి తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భరత నాట్యప్రదర్శనలో పుష్పాంజలి, మల్లారి కోలాటం, శ్రీరాఘవం, తులసిదాస్‌ భజన, తిల్లాన తదితర అంశాలను నిత్యశ్రీ, లోహిత, ధనుష్క, అక్షర, నవరత్న, అముక్తరెడ్డి, రుహిక తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

ముగిసిన సీఐఏ, ఎంఎస్‌ఎంఈ పారిశ్రామిక ప్రదర్శన



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న సుధీర్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి

కుషాయిగూడ: చర్లపల్లి పారిశ్రామికవాడలోని చర్లపల్లి ఇండస్ట్రియల్‌ అసోసియేషన్‌లో గత మూడ్రోజులుగా సాగుతున్న సీఐఏ 5వ ఎంఎస్‌ఎంఈ పారిశ్రామిక ప్రదర్శన శనివారం ముగిసింది. చర్లపల్లి పారిశ్రామికవాడకు చెందిన వందకు పైగా పారిశ్రామికవేత్తలు వారి వారి ఉత్పత్తుల ప్రదర్శన విజయవంతమైంది. ముగింపు కార్యక్రమానికి టిఫ్‌ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, సీఐఏ అధ్యక్షుడు గోవింద్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రదర్శనలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇలాంటి ఎక్స్‌పోలతో పారిశ్రామికవేత్తల మధ్య సత్సంబంధాలు పెరిగి వ్యాపారాభివృద్ధికి దోహదపడతాయన్నారు. దీనిని పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మియపురం రమేష్‌, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, గోపాలరావు, పీఎస్‌ మోహన్‌, మూర్తి, రమేష్‌కృష్ణ, కామేశ్వరరావు, వినోద్‌ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



అన్నోజిగూడలో..



సీఎంఆర్‌ కళాశాలలో మాట్లాడుతున్న ఎస్సై అనిత



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

మేడ్చల్‌ జోన్‌ పరిధిలోని ఘట్కేసర్‌, పోచారం, జవహర్‌నగర్‌ తదితర ప్రాంతాల్లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం జరిగిన ఈ వేడుకల్లో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని మహిళల గొప్పదనం గురించి వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాలయాల్లోని మహిళా సిబ్బంది, విద్యార్థులతో పాటు మహిళా పోలీసులను ఉన్నతాధికారులు ఘనంగా ఘనంగా సత్కరించారు. పలుచోట్ల వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

– మేడ్చల్‌ జోన్‌ బృందం



పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఘనాపూర్‌ మాజీ సర్పంచ్‌ మమత



మహిళా వైద్యురాలిని సత్కరిస్తున్న మాజీ చైర్‌పర్సన్‌ పావనీజంగయ్య



వాణిదేవిని సత్కరిస్తున్న దృశ్యం



నర్సింహ్మారెడ్డి కళాశాలలో..



ఎమ్మార్‌సీఈ కళాశాలలో..



జవహర్‌నగర్‌లో కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్‌



సెయింట్‌పాల్స్‌ స్కూల్‌లో..



గుండ్లపోచంపల్లి కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో..